# మధ్యతరగతి అమ్మ

చెంగు చెంగున పరుగెత్తుకు వెళ్తున్న బుజ్జిగాడు కాళ్ళు అడ్డం తగిలి బోర్లాపడ్డాడు. దెబ్బగట్టిగా తగిలింది. "అబ్బా!..." అనుకున్నాడు. మోకాలు దగ్గర కాస్త చర్మం లేగింది లేచి నిలుచుని ఒకసారి తనను తాను చూసుకున్నాడు. చొక్కా అంతా మురికి అయిపోయింది... అంతే... నొప్పి ఎక్కడికో ఎగిరిపోయింది.

అమ్మో బట్టలు ఇలా మురికి చేసుకుని ఇంటికి వెళ్తే అమ్మ తంతుంది... ఇప్పుడెలా?... రేపటినుండి ఆడుకోడానికి పంపదు. ఇంటిలోనే చెల్లాయితో ఆడుకోమంటుంది. దానితో ఆడాలంటే విసుగు. నాచేతిలో ఏదుంటే దానికి అదే కావా లంటుంది... అనుకున్నాడు.

మళ్లీ వంగి ఒకసారి తనచొక్కావంక చూసుకున్నాడు. ఎంత మురికో?!... చేత్తో మురికి వున్నచోట దులుపుకున్నాడు. మరింత ఎక్కువగా మురికి చొక్కానిండా పులుముకుంది. బుజ్జి గాడికి ఏడుపొచ్చింది. అమ్మకేమని చెప్పాలి? రాజుగాడు తోసే శాడని చెప్తే అంత ఒళ్ళు తెలీకుండా పరుగెత్తుకొస్తున్నావా అని రెండు తంతుంది.

అబ్బా!...

మోకాలు మీద చురుకు చురుకు మంటుంటే వంగి

చూసుకున్నాడు. రేగిన చర్మం దగ్గర ఎర్రగా రక్తం!! ఈ దెబ్బ చూస్తే ఎక్కడలేని డబ్బూ మీ మందులకే సరిపోదు అని నాన్న తంతాడు. అసలు నాయనమ్మ మందులకే బోల్డంత ఖర్చవుతుంది... నాన్నేమో అందరికీ మందులకి ఖర్చవుతుందని అనవసరంగా అంటాడు.

మళ్ళీ మోకాలుమీద చురుక్ మంది. బుజ్జిగాడు వంగి మోకాలు మీద అరచెయ్యి ఆనించి గట్టిగా వత్తి కాస్సేపుపట్టుకున్నాడు. చేతికి రక్తం కాస్త జిగురుగా అంటుకుంది. నేల మీద చెయ్యి గట్టిగా రుద్దాడు. రక్తం పోయింది. చెయ్యంతా మట్టి మట్టి అయింది. రెండుచేతులూ దులుపుకుని మోకాలు చుట్టూ ఉన్న మట్టి దులుపుకుందామని వంగిన బుజ్జిగాడు అలానే ఉండిపోయాడు. వాడి కళ్ళు జిగేల్ మన్నాయి. గుండె కాస్సేపు బరువుగా కొట్టుకుంది. అక్కడ .. మట్టిలో అర్ధ రూపాయి బిళ్ళ!... చుట్టూ చూశాడు. ఎవరూ తనని చూస్తున్నట్లు అనిపించలేదు. వంగి అర్ధరూపాయిని చేతిలోకి తీసుకున్నాడు. అది వాడికి కిలో రాయంత బరువనిపించింది. ఎవరైనా వచ్చి దాన్ని లాగేసుకుంటారేమోనని వాడికి భయమేసింది. చుట్టూ ఒకసారి దొంగలాగా పరికించి చూసి అర్ధ రూపాయి బిళ్ళను లాగుజేబులో వేసుకొని ముందుకు పరుగెత్తాడు. వాడికి ఇప్పుడు కాలునొప్పి తెలియటంలేదు. ఆ అర్ధరూపాయే గనుక వాడికి దొరికి ఉండకపోతే వాడు ఇంటికి కుంటుకుంటూ వెళ్ళేవాడే.

బుజ్జిగాడి చిన్ని మనసులో ఆలోచనలు మొదలయ్యాయి. వాడి గుండెలో ఆ అర్ధరూపాయి బిళ్ళ ఖంగు

ఖంగుమని మ్రోగుతుంది. అర్ధరూపాయితో గాలిపటాలు కొనుక్కుంటే?... ఊహు...కాదు. స్కూలు వంటి బెల్లప్పుడు ఐస్ ఫ్రూట్ కొనుక్కోవాలి! ఆ సుబ్బిగాడు రోజూ ఐస్ ఫ్రూట్ కొనుక్కుంటాడు. వాళ్ళమ్మ వాడికి రోజూ ఐదు పైస లిస్తుంది. అమ్మనాకు అసలెప్పుడూ ఇవ్వదు. అర్ధరూపాయికి పది ఐస్ఫ్రూట్లొస్తాయ్!... పదిరోజులు కొనుక్కోవచ్చు!!... పాపం. చెల్లాయికి కూడా ఇంటిదగ్గర ఒక ఐస్ఫ్రూటుకొని యివ్వాలి!...మరి గాలిపటమో?... గాలిపటం కొంటే నేను కూడా ఎగరేస్తానని చెల్లాయి ఏడుస్తుంది. పోనీ ఒక్క గాలిపటమే కొని మిగతా డబ్బులతో ఐస్ఫ్రూట్లు కొనుక్కుంటేనో?... అవును... అలాచేస్తే బావుంటుంది.

బుజ్జిగాడిలో ఉత్సాహం మరింత పెరిగింది. పరుగు వేగంకూడా పెరిగింది. ఇల్లు వచ్చేసింది.

"ఏమిట్రా నీ బట్టలూ - నీ వాలకం కూలి వెధవలా... మీ బట్టలుతక లేక రెక్కలు పడిపోతున్నాయి దరిద్రపు వెధవా! ..." ఇంటిలోకి అడుగుపెడుతూనే అమ్మ దీవెనలు చెవిన పడ్డాయి బుజ్జిగాడికి. తంతుందేమోనని భయపడ్డాడు.

"ఏదీ...లాగూ చొక్కా విప్పేసేయ్... వేరేవి తొడుగుతాను" అంటూ దగ్గరకు వచ్చింది అమ్మ.

బుజ్జిగాడి గుండెల్లో రాయిపడింది. లాగు జేబులోని అర్ధరూపాయి అమ్మ చూసిందంటే?!...

"బట్టలు విప్పుతుంటే గుడ్లుమిటకరిస్తావేరా వెధవా?..." చొక్కా గుండీలమీద చెయ్యివేసింది. బుజ్జిగాడు లాగు జేబులో చెయ్యిపెట్టి అర్ధరూపాయి బిళ్ళను తడుముకున్నాడు.

అమ్మ లాగువిప్పి మూల పడేస్తుంది... బీరువాలోంచి ఇస్త్రీ బట్టలు తీసుకురావడానికి లోపలికి వెళుతుంది. అప్పుడు ఈ లాగు జేబులోని అర్ధరూపాయి తీసిఎక్కడైనా దాచేయాలి!

చొక్కా విప్పి మూలకు విసిరేసింది. 'లాగు జేబులోంచి చెయ్యితియ్...'.

లాగు కూడా విప్పి విసురుగా గదిమూలకు విసిరేసింది అమ్మ. ఆ విసురులో లాగు జేబులోని అర్ధరూపాయి బిళ్ళ జారి ఖంగున శబ్దంచేస్తూ నేలపైపడి కొంతదూరం దొర్లింది. బుజ్జిగాడి గుండె క్షణంఆగింది. అమ్మ చూపుకూడా అర్ధరూపాయి బిళ్ళమీద క్షణంఆగింది. ఆమె ముఖం తీవ్రంగా మారింది.

"అర్ధరూపాయి ఎక్కడిదిరా?...నాన్నగారి జేబులు గాని సర్దుతున్నావా వెధవా...?"

'దొరికిందే...' బుజ్జిగాడు నీరసంగా జవాబు చెప్పాడు

'ఎక్కడరా?... అమ్మకంఠంలో కుతూహలం-కళ్ళల్లో వెలుగు.

'ఆంజీలుసామి గుడిదగ్గర'

అమ్మ వంగి అర్ధరూపాయి తీసి మొల్లో దోపుకుంది.

"రేపు కూరకి పనికివస్తుంది."

బుజ్జిగాడిని ఎత్తుకుని ముద్దుపెట్టుకుని 'ముఖం కడుగుతాను రా...' అంటూ బాత్రూముకు దారితీసింది.

బుజ్జిగాడికి ఏడుపొచ్చింది.

సెప్టెంబరు, 1981 యువ.